క్లుప్తంగా

పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఏపీఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని చీకూర్తి, చాల్కి, రాఘవాపూర్, హుమ్నాపూర్ తదితర గ్రామాల్లో బుధవారం ఎంపీడీఓ రాజశేఖర్, ఏపీఓ రంగారావు పర్యటించారు. ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులు, నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికమవుతున్నందున పని ప్రదేశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు సూచించారు. నర్సరీల్లోని మొక్కలు రోజు నీటిని అందించాలన్నారు.

వట్‌పల్లి ఎంపీడీఓగా అంజయ్య



వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి ఎంపీడీఓగా అంజయ్య బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఇప్పటివరకు ఉన్న ఎంపీడీఓ శశిప్రభ సెలవులపై వెళ్లడంతో కోహీర్ మండలాభివృద్ధి కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన అంజయ్యను వట్‌పల్లి ఎంపీడీఓగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందడంలో, సమస్యల సత్వర పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎంపీఓ ఖాజా నాసిరోద్దీన్, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓను కలిసి అభినందనలు తెలియజేశారు.

దీర్ఘకాలిక రుణాలివ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

సంగారెడ్డి టౌన్ : రైతులు ప్రైవేట్ అప్పులు తీర్చుకునేందుకు బ్యాంకులు దీర్ఘకాలిక రుణాలు ఇవ్వాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ అప్పులకు సంబంధించి ఆర్బీఐ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ నుంచి ఆదేశాలు వచ్చినట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంక్ అధికారులు, రైతు సంఘాల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ పుష్ప దంపతులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన రామాలయం, శివాలయం, సరస్వతీదేవి ఆలయం విగ్రహప్రతిష్ఠాపన, ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనం నిర్వహించారు. ఇందులో కార్పొరేటర్ పుష్ప దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సాగుకు పనికిరాని భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాంరెడ్డి

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని సాగుకు పనికిరాని భూములను ఆర్డీఓ రాంరెడ్డి పరిశీలించారు. బుధవారం మండలంలో పర్యటించి గ్రామాలవారీగా రాళ్ల రప్పలు, గుట్టలు కలిగిన భూముల వివరాలు తెలుసుకున్నారు. వాటి సర్వే నంబర్ల జాబితా రూపొందించి ఫీల్డ్‌లో పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. భూసమస్యలపై వచ్చిన ఫిర్యాదులను సమీక్షించారు. ఆయన వెంట తహసీల్దార్ హసీనాబేగం, ఆర్ఐ.సాయికిరణ్, అగ్రికల్చర్ అధికారిణి సరస్వతి ఉన్నారు.

నాణ్యమైన హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

ఉరుకులు.. పరుగుల జీవితంలో వేగానికి ఉన్న ప్రాధాన్యం భద్రతకు ఇవ్వకపోవడంతో భారీమూల్యం చెల్లించక తప్పడంలేదు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. నాసికరం హెల్మెట్లను ధరించడంతో అవి పగలి తలకు తీవ్రగాయాలయి ప్రాణాలు కోల్పోతున్నారు. ఐఎస్ఐ మార్కు ఉన్నహెల్మెట్లను ధరిస్తే అందరికీ మంచిదని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు.

- ఐఎస్ఐ మార్క్ ఉంటేనే కొనాలి
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సంగారెడ్డి క్రైమ్: ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకోవడానికి ప్రజలు, యువత వివిధ మార్కెట్లో లభించే చౌక ధరల హెల్మెట్‌లు కొనడానికి ఆసక్తి చూపుతున్నారు. వాటి వల్ల తమ ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. కేంద్ర నిబంధనల ప్రకారం ఐఎస్ఐ మార్కు గల హెల్మెట్లనే కొనాలి, ధరించి ద్విచక్రవాహనలు నడపడం అందరికీ మంచిది అని పట్టణ పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఫ్రిబవరి 19న కొండాపురం మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన యువకుడు ఇంటి నుంచి తన ద్విచక్రవాహనంపై సరుకుల కోసం బయలుదేరాడు. మల్కాపూర్ దాటిన తర్వాత వెనక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. అతని తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే, పట్టణానికి చెందిన రైతు బంధువు ఫంక్షన్‌కు హనుమాన్ నగర్‌కు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఎంఎన్ఆర్ ఆస్పత్రి దాటిన తర్వాత కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయలు కావడంతో హాస్పిటల్‌కు తరలిస్తుండగా మృతిచెందాడు. దీనికి ప్రధాన కారణం అతను ధరించిన హెల్మెట్ పగిలిపోవడం. పట్టణంలో కొన్ని నెలలుగా జరుగుతున్న ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో నాసిరకం హెల్మెట్లు ధరించడంతోనే మృతి చెందారని పోలీసులు గుర్తించారు. నాసిరకం హెల్మెట్లు వాడొద్దని ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.



రోడ్డుపై విక్రయానికి ఉంచిన హెల్మెట్లు

ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకోవచ్చు ..

పట్టణంలో చాలా మంది యువకులు, ద్విచక్ర వాహనదారులు పోలీసుల చలాన్‌ల నుంచి తప్పించుకోవడానికి రోడ్లపై లభించే నాసికరం హెల్మెట్లను కొంటున్నారు. అవి ప్రమాదాలు జరిగినప్పుడు పగిలి తలకు తీవ్రగాయాలయి.. ప్రాణాలు కోల్పోతున్నారు..

ఐఎస్ఐ మార్క్ హెల్మెట్ ధరించాలి



హెల్మెట్లు కొనేటప్పుడు వాహనదారులు తప్పనిసరిగా కొన్ని జాగ్రత్త పాటించాలి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐఎస్ఐ మార్క్ ఉన్న హెల్మెట్లనే కొనాలని, అవి ప్రమాదాల సమయంలో తమ ప్రాణాలకు రక్షణ కవచంగా పనిచేస్తాయి. చిన్న ప్రమాదానికే నుజ్జునుజ్జు అయ్యే ఫైబర్ గ్లాస్, సీసీ మెత్తని పాలిస్టరిని ఎట్టి పరిస్థితుల్లో వినియోగించొద్దు. వాటి వల్ల తలకు భద్రత ఉండదని, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– పట్టణ సీఐ రమేష్

వేతన బకాయిలు చెల్లించండి

- 'ట్రైడెంట్' వద్ద కార్మికుల ఆందోళన
- యంత్రాల తరలింపు అడ్డగింత

జహీరాబాద్: మండలంలోని కొత్తూర్(బి) గ్రామశివారులోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం వద్ద బుధవారం కార్మికులు ఆందోళన చేశారు. కర్మాగారంలోని యంత్రాలను తరలించే పనులను వారు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.జి.రాములు మాట్లాడుతూ.. కార్మికులకు పీఎఫ్ సొమ్ముతో కలుపుకొని రూ.8 కోట్ల వేతన బకాయిలు రావాల్సి ఉందన్నారు. బకాయిలు చెల్లించే విషయంలో యాజమాన్యం జాప్యం చేస్తోందని వాపోయారు. కర్మాగారం అంశం కోర్టు పరిధిలో ఉన్నందున ఎవరు కూడా కర్మాగారంలోకి ప్రవేశించవద్దనే నిబంధనలుంటాయన్నారు. అయినా ఓ ప్రైవేటు సంస్థకు చెందిన ఇంజనీరింగ్ నిపుణులు వచ్చి కర్మాగారంలోని యంత్రాలను కట్టర్లతో కత్తిరించి ఇతర ప్రాంతాలకు తరలించే ప్రక్రియ చేపట్టారని, దీనిని తాము అడ్డుకున్నామన్నారు. కర్మాగారంలో క్రషింగ్‌ను నిర్వహించేందుకు ముందుకు వచ్చేవారికి మాత్రమే కర్మాగారాన్ని యాజమాన్యం విక్రయించాలన్నారు. లేనట్లయితే తాము ఊరుకోబోమని హెచ్చరించారు. కర్మాగారం యంత్రాలను తరలించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ పోలీసులు, రెవెన్యూ, కేన్ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.



కర్మాగారం వద్ద కార్మికుల నిరసన

వరుణ్‌మోటార్స్, నందిని షోరూంలు సీజ్



వరుణ్ మోటార్స్‌ను సీజ్ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ సభ్యులు

జోగిపేట(అందోల్): అందోల్ జోగిపేట పురపాలక సంఘం పరిధిలోని వ్యాపార సంస్థలు లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకోని వరుణ్ మోటార్స్, నందిని షోరూంలను సీజ్ చేసినట్లు జోగిపేట మున్సిపల్ కమిషనర్ తిరుపతి తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించిన వృత్తి వ్యాపార లైసెన్స్ తీసుకోని వారు వెంటనే తీసుకోవాలన్నారు. గడువు ముగిస్తున్నందున అపరాధ రుసుము పడకుండా చూసుకోవాలని చెప్పారు. సంవత్సరం నుంచి లైసెన్స్ తీసుకొని కారణంగా వరుణ్‌మోటార్స్, నందిని షోరూంలను టాస్క్‌ఫోర్స్ టీం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. పురపాలక సంఘం టాస్క్‌ఫోర్స్ టీం ఆకస్మిక తనిఖీల్లో లైసెన్సు లేనట్లయితే పురపాలక చట్టం–2019 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. చర్యలతో పాటు భారీ జరిమానా విధిస్తామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ ఖైమోద్దిన్, జవాన్ రాజశేఖర్ మున్సిపల్ సిబ్బంది సీజ్ చేసిన వారిలో ఉన్నారు.

రోడ్డు ఆక్రమణకు యత్నం.. కేసు నమోదు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజీపల్లి నుంచి మంత్రి కుంటకు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డును ఆక్రమించిన పలువురిపై సీఐ రవీందర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. కాజీపల్లికి చెందిన ఎస్‌కే ఉస్మాన్, ఎస్‌కే సలీం, ఎస్‌కే జహీర్ కలిసి జేసీబీతో రోడ్డును ఆక్రమించేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న స్థానికులు కమిషనర్ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయాలని చూస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ జైత్రంనాయక్ హెచ్చరించారు.

నీటి ఇబ్బందులకు ముందస్తు చర్యలు

భగీరథ చీఫ్ ఇంజనీర్

నారాయణఖేడ్: తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు మిషన్‌భగీరథ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం నిజాంపేట్ మండల కేంద్రంలో సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. పలు కాలనీలు తిరుగుతూ నీటి సరఫరా పరిస్థితిని ఆరా తీశారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్ష నిర్వహించారు. గ్రామంలో ఉన్న ఒక ట్యాంకు ఎన్ని కుటుంబాలకు నీటిని సరఫరా చేయగలదని, నీరు గ్రామానికి సరిపోతుందా అనే విషయాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరా ఇబ్బందులు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. సమీక్షలో భగీరథ ఎస్ఈ రఘువీర్, ఈఈ గ్రిడ్ నాగభూషణం, డిప్యూటీ ఈఈ ఫణివర్మ, గ్రిడ్ డీఈ గాయత్రి, ఏఈలు శ్రీకాంత్, నాగభూషణం పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు

సైబర్ నేరాలపై అప్రమత్తత

కల్హేర్(నారాయణఖేడ్): సైబర్ నేరస్తులపై అప్రమత్తంగా ఉండాలని సిర్గాపూర్ ఎస్ఐ డి.వెంకట్‌రెడ్డి సూచించారు. బుధవారం నల్లవాగు గురుకుల కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. లాటరీ తగిలిందని, ఇతర మాయమాటలు చెప్పి అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే స్పందించవద్దని తెలిపారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శ్రీమాణిక్ ప్రభు ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా శ్వేత, ఎంఈఓగా గాయత్రి, ప్రిన్సిపాల్‌గా విఘ్నేష్ వ్యవహరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటయ్య విద్యార్థులను అభినందించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కల్పన, నాగలక్ష్మి, శివశంకర్, అనిత, సువర్ణ, సోని, లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది చెరువులు, కుంటలు, మురుగు కాల్వల్లో ఆయిల్ బాల్స్ విడుదల చేశారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు శానిటరీ ఇన్ స్పెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నీరు నిల్వ ఉండకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పరిశుద్ధ్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్



తాపీ మేస్త్రీలకు బీమా పత్రాలు అందజేస్తున్న సీనియర్ టెక్నికల్ సర్వీసెస్ శ్రీకాంత్

వికాట్ గ్రూప్ సీనియర్ టెక్నికల్ సర్వీసెస్ శ్రీకాంత్

కల్హేర్(నారాయణఖేడ్): సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న వికాట్ గ్రూపుకి చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో తెలంగాణలో విడుదల చేశామన్నారు. వికాట్ గ్రూప్ కంపెనీలు ప్రపంచంలో 12 దేశాల్లో విస్తరించి ఉన్నాయని సీనియర్ టెక్నికల్ సర్వీసెస్ వి.శ్రీకాంత్ అన్నారు. బుధవారం బాచేపల్లిలో ఉమా సంగమేశ్వర ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు సమావేశం నిర్వహించారు. భారతి సిమెంట్‌ను ఇతర సిమెంట్‌తో పోలిస్తే నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. నిర్మాణం చాలా దృఢత్వంగా ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని భరోసా ఇచ్చారు. ఇంటి నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి క్లుప్తంగా వివరించారు. తాపీ మేస్త్రీలకు రూ. లక్ష విలువైన ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. సమావేశంలో న్యూ సప్తగిరి ట్రేడర్స్ డీలర్ దత్తు, సబ్ డీలర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితుల పక్షాన పోరాటం చేయాలి

నారాయణఖేడ్: అన్యాయం జరిగిన చోట బాధితుల పక్షాన నిలబడి న్యాయం జరిగేలా చూడాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్‌కు సంబంధించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలను చైతన్యపరచడంలో సంఘం బాధ్యుల కృషి బాగుందని కొనియాడారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహులు, జిల్లా అధ్యక్షుడు ఓంప్రకాష్, ఇతర బాధ్యులు సంతోష్‌రావు, రాజశేఖర్, శ్రీనివాస్, దత్తు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

జేఎన్టీయూ కళాశాలలో సైన్స్ డే

సంగారెడ్డి : చౌటకూరు మండలంలోని సుల్తాన్పూర్ జేఎన్టీయూ కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగం, ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సైన్స్‌డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ మాట్లాడుతూ.. సైన్స్ మానవ పురోగమనానికి ఎంతో ముఖ్యపాత్ర పోషిస్తోందని తెలిపారు. చక్రం సృష్టించడం నుంచి బాహ్య అంతరిక్షం అన్వేషణ, వ్యాక్సిన్‌ల అభివృద్ధి నుంచి కృత్రిమ మేధస్సు వరకు, సైన్స్ ప్రపంచాన్ని విస్తృతంగా ప్రభావితం చేస్తోందన్నారు.సీఆర్‌సీ చైర్మన్, హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగాధిపతి విజయకుమార్ సీవీ రామన్ ఎఫెక్ట్ (పదార్థం ద్వారా ఫోటాన్ల తాత్కాలిక విక్షేపణం) ఆవిష్కరణకు గుర్తుగా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహిస్తారు. ప్రత్యేకంగా విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి కలిగించి, కొత్త ప్రయోగాలకు ప్రేరణ కల్పించడం, వైజ్ఞానిక విజయం గురించి అవగాహన కల్పించడమే లక్ష్యమని వివరించారు . కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య రాఘవేందర్ రావు, విభాగాధిపతులు ఆచార్య రజనీష్, ఆచార్య జోషి శ్రీపాద్, ఆచార్య బేబీ శాలిని, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సైన్స్ డేలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ నర్సింహా

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భక్తులు

నారాయణఖేడ్: పట్టణ శివారులో నిర్మించిన భక్త మార్కండేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. బుధవారం రెండో రోజు యాగ సంకల్పం వేదమంత్రి పారాయణం, గణపతిపూజ, దాన్యాది వాసం తదితర కార్యక్రమాలను గురుజ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాదవానంద సరస్వతీ స్వామి, ప్రముఖులు గురువారం విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



పటాన్‌చెరు టౌన్: పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



జోగిపేటలోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకున్నారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు 144 సెక్షన్ అమల్లో ఉంచారు. పలు సెంటర్‌ల్లో విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించారు.

అక్రమ కలప రవాణా అడ్డగింత

వట్‌పల్లి(అందోల్): మండలంలోని కన్‌సాన్‌పల్లి గ్రామ శివారులో అక్రమ కలప తరలింపును మంగళవారం రాత్రి ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలో జరుగుతున్న అక్రమ కలప వ్యాపారంపై స్థానికుల సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సిబ్బంది రఘుపతితో కలిసి కలప రవాణాను అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలిసిన వ్యాపారులు వెంటనే ట్రాక్టర్‌లో నుంచి కలపను పారవేసి ట్రాక్టర్‌ను తరలించే క్రమంలో అధికారులు పట్టుకొని సంగారెడ్డి ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు. దర్యాప్తు చేపట్టి జరిమానా విధిస్తామని చెప్పారు. అనుమతి లేకుండా కలపను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

సంక్షిప్త వార్తలు

◆ రియల్ ఎస్టేట్ సంస్థకు నోటీసులు

పటాన్‌చెరు: నాలా కబ్జా చేసిన ప్రణీత్ ప్రణవ్ నైట్ వుడ్స్ సంస్థకు జీహెచ్ఎంసీ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. పట్టణంలో ఆ సంస్థ గేటెడ్ కమ్యూనిటీని ఏర్పాటు చేసింది. భూయజమానులను మోసం చేసి అక్రమ నిర్మాణాలు చేసిందనే ఫిర్యాదులతో జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమ నిర్మాణాలు చేసిందని నిర్ధారించారు. కానీ ఇప్పటివరకు ఆ సంస్థ స్పందించకపోవడంతో జీహెచ్ఎంసీ అధికారులు తాజాగా మరోసారి నోటీసులు ఇచ్చారు. వాగు కాల్వకు అనుకుని నాలా బఫర్ జోన్‌ను ఆక్రమించారని తేల్చారు. ప్రణీత్ డెవలపర్లు నాలాలోకి 3 మీటర్లు, నాలా బఫర్ జోన్‌లో అదనంగా 9 మీటర్లు ఆక్రమించారని జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఇటువంటి చర్యలు పట్టణ ప్రణాళిక చట్టాలను ఉల్లంఘించడమే కాకుండా ప్రజాభద్రత, డ్రైనేజీ వ్యవస్థలకు కూడా ముప్పు కలిగిస్తాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

◆ క్యాలెండర్ ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: జాతీయ వికలాంగుల హక్కుల వేదిక(ఎన్‌పీఆర్‌డీ) నూతన సంవత్సరం క్యాలెండర్‌ను బుధవారం ఆర్డీఓ రాంరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగులు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలన్నారు. వారి సంక్షేమ కోసం పాటుపడుతామని, ప్రభుత్వం పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింలు, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల అధ్యక్షులు ఎండీ వాజీద్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యుత్ వైరు చోరీ

హత్నూర(సంగారెడ్డి): నూతనంగా నిర్మించిన వెంచర్‌లో విద్యుత్ వైరు చోరీకి గురైంది. ఈ సంఘటన మంగళవారం రాత్రి హత్నూర మండలం నస్తిపూర్ గ్రామశివారులోని వెంకటేశ్వర లేక్వ్యూ వెంచర్‌లో 29 విద్యుత్ స్తంభాల నుంచి 5 వరుసల తీగను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించకపోయారు. మూడు లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు ప్రభాకర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాత్రి 12 గంటల 28 నిమిషాలకు సీసీ కెమెరా ఆగిపోయిందని అదే సమయంలో దొంగలు వైరును కత్తిరించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాడు. అలాగే, మంజీరా నది తీర ప్రాంతంలో సైతం పంపుసెట్లకు సంబంధించిన కేబుల్ వైర్లు చోరీకి పాల్పడుతున్నట్లు రైతులు వాపోయారు.

◆ మహా పాదయాత్ర ప్రారంభం

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ధనసిరి పీఠాధిపతి వీరేశ్వర శివాచార్యులు శిష్యులు, భక్తులతో కలిసి ప్రతి సంవత్సరం శ్రీశైలక్షేత్రానికి మహా పాదయాత్ర చేపడుతారు. గత 30 సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినం అనంతరం పాదయాత్ర ప్రారంభమవుతుంది. పాదయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. ఈ మేరకు బుధవారం వీరేశ్వర శివాచార్యులు గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో మహా పాదయాత్రను ప్రారంభించారు. సుమారు వెయ్యి మంది భక్తులు పది రోజుల పాటు 380 కిలో మీటర్ల దూరం పాదయాత్ర చేపడుతారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ జగ్నాథ్, మాజీ సర్పంచ్ హబ్సిరాజు, మల్లికార్జున్‌రెడ్డి, ప్రముఖులు ఇప్పపల్లి మల్‌శెట్టి, అశోక్, విజేందర్‌రెడ్డి, హబ్సిదేవరాజ్, సిద్దప్ప, శ్రీరాం శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, గణేష్ యువజన సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో ఇరవై మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా 20 మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ బీసీ కులగణనతోనే సామాజిక న్యాయం

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన చారిత్రాత్మక నిర్ణయమని, ముదిరాజ్‌లకు రాజకీయంగా అవకాశాలు పెరుగుతాయని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ... జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రాజకీయ అవకాశాలను కల్పించాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌ల ప్రాతినిధ్యం పెరగనుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతోనే ఈ మహోత్తర నిర్ణయం సాధ్యమైందన్నారు.